కథానిక

# తోడు దొంగలు

దోగిపర్తి వెంకటరమణ

ఎలా మెళకువ పడ్డాడో గాని, రామనాథం కళ్లు విప్పి చూచేసరికి గడియారం చిన్నముల్లు నాలుగు చూపెడుతోంది. నెమ్మదిగా ఒక మూలనుంచి ప్రకృతి తెల్లబూడిద జల్లుకుంటోంది. ఇంకా శోభ కనురెప్పలు నిద్ర బరువుకి కలల అలల్లో తేలిపోతూ, సుఖ సాగరంలో హృదయం అల్లలాడుతోంది. రామనాథం నిశ్శబ్దంగా, తన నడుం మీద వాల్చిన శోభ చేతిని తొలగించి లేచాడు. శోభ ముఖం దీప కాంతిలో స్పష్టంగా నవ్వుతోంది.

శోభను చూసేసరికి రామనాథానికి ముఖం మీద హాసరేఖ వెలిగింది. గిలిగింతలు పెడుతోంది. యౌవనగిరి శిఖరాల్లో విహరిస్తోన్న అతని ఆనందం, టేబిల్ మీద డోములైటు కాంతి నీడలో అస్పష్టంగా పచ్చకవరుమీద వాలింది. శోభ తనకెంత ఆనందం చేకూరుస్తుంది? తన యౌవన తాపానికి నీడ! తన హృదయస్వర్గంలో మేడ! మళ్లీ కవరు వ్యవహారం జ్ఞాపకంవచ్చింది. ఎక్కణ్ణుంచి వచ్చిందీ కవరు తనకి? రాత్రినించి అర్థంగాని వ్యర్థబాధతో సతమతమవుతోన్న మేధస్సు పాథస్సుల్లో అట్టడుక్కి తేలిపోతోంది. ఎవరు వ్రాసిందా కవరు? కవరు తీసి మళ్ళీ చదివాడు.

ప్రియ ప్రియంకర రామనాథంగారికి,

అనివార్యమైన ఆపదలో ఉన్నాను. అర్జంటుగా ఉన్నపళాన రావాలి. మీరు నన్ను యథార్థంగా బాగా ఎరుగుదురు. సందేహించవలసిన అవసరం లేదు. కాని మీ స్మృతిపథంలో మాసిపోయి ఉంటాను. నన్ను గురించి మీ రహోహాలు పడతారని నాకు తెలుసు ఏది ఎలాగైనా, మీమీద పెట్టుకున్న ఈ ఆపద్ధారానికి మీరే వాహకులు. ఈ చోటికి వచ్చి, ఉచితోపకారం చేస్తే, ధన్యురాలి నవుతాను. మీకు అజన్మాంతర దాసీత్వం చేస్తాను. మీరే రావాలి. మీ ఒక్కరివల్లే ఆ పని అవుతుంది. మీకోసం ఎల్లప్పుడూ ద్వారాలు నిరంతరం తెరచుకుని ఉంటాయి. స్టేషన్ దగ్గర కారు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటుంది. ముమ్మాటికీ రావాలి.

ఇట్లు,

కృష్ణకుమారి

* * *

ఆడవాళ్ల దస్తూరీని పురస్కరించుకున్న ఆ వుత్తరం, రామనాథం పాలిటి మహాసమస్యై కూర్చుంది. ఎవరీ కృష్ణకుమారి? రాజమండ్రిలో ఉంటున్న ఈ రామనాథమే ఎందుకు కావలసి వచ్చింది. ముక్కోటి ఆంధ్రుల్లో ఈ రామనాథం తప్ప ఆ కృష్ణకుమారికి మరెవరూ దొరకలేదా? రామనాథానికి తల తిరిగి పోయింది. రమ్మని ఎంత స్నేహమయంగా వ్రాసింది? "ప్రియ ప్రియంకర" సంబోధన! రామనాథానికి సాధారణంగా ఉత్తరాలు రావు. రాసే ముఖ్యస్నేహితులే అరుదు! అందులో ఇటువంటి యువతీ స్నేహాలు అసల్లేనే లేవు. అలాంటప్పుడు ఈ క్రొత్త సంబోధన అతనికి తియ్యని ఆశ అందించింది.

"ఒక అజ్ఞాత స్నేహమయి". ఏమో! చాలా కాలం క్రితం ఎరిగుండవచ్చు. తను హైస్కూళ్ళలో కాలేజీల్లో చదువుకునేటప్పుడు ఎరిగుండవచ్చు. అయినా ఆ పేరున్న వాళ్లెవరూ తనకి జ్ఞాపకం లేరే! ఎవరో కృష్ణాయమ్మ అనే అమ్మాయిని తాను బాగా యెరిగున్నట్టు జ్ఞాపకం! పేరు మార్చుకునుండొచ్చు కృష్ణాయమ్మ ఏం బాగుంది అసహ్యంగా. అందుకే "కృష్ణకుమారి"! ఎంతమంది పేర్లు మార్చుకోవటం లేదు? తానుగూడా పేరు మార్చుదామనే చూస్తున్నాడుగా.

ఉత్తరంలో మళ్లీ కొన్నిమాటలు జ్ఞాపకంలోపడి గిలగిల తన్నుకుంటున్నాయి. “ఆజన్మాంతర దాసీత్వం” “స్వర్గద్వారాలు” తనే ఆపద్భారవాహకుడు. తను ఒక్కడే రావాలిట!

రామనాథం హృదయసాగరంలో అలలు ఉత్తుంగ శిఖరాలై చెలియలికట్టను ఒరపిడి చేస్తున్నాయి. ఆఖరికి ఉత్సాహంగా నిట్టూర్పు విడిచాడు. వెనక్కి తిరిగి శోభ ముఖంలోకి చూచేడు. జాలిగా పడుకుని ఉంది. కళ్లు తెరచి చూస్తోన్నట్టుందే! లేదు లేదు కళ్లు మూసుకునే వుంది. శోభ ఎప్పుడూ ఎందుకో నవ్వుతూనే వుంటుంది. అందరూ యెప్పుడూ ఏదో మాట్లాడుతూ వుంటారు. కాని శోభ ఎప్పుడూ ఏదో నవ్వుతూనే వుంటుంది. రామనాథం పచ్చ కవరు జేబులో పెట్టేసి కళ్లు నులుముకున్నాడు. ఆలోచనల బరువుతో, వాలిపోతోన్న జాలి నేత్రాలు, మేలి వలపుల సరస్సులో ఈదులాడుతోన్నై. తనకో క్రొత్త స్నేహితురాలు అయాచితంగా లభించింది. తనలో ఏనాటినుంచో పేరుకుంటోన్న జడత్వాన్ని గోటితోగిల్లి మేలుకొలిపింది. అతనిలో ఆశలకి మెలి పెట్టింది. ఆరిపోయిన కోరికల్ని ఈరిక తెత్తించింది. శోభకీ ఉదంతం తెలిస్తే! ఊహు, తెలీకూడదు! పత్రికలలో కూడా తెలీకూడదు. తనేమైనా తప్పు చేస్తున్నాడా? లేదు. పరోపకారం చేయమని ఒకళర్థించినపుడు ఊరుకోవడం మేలు కాదు. అది ఒక ఆత్మద్రోహం క్రిందే లెక్కకు వస్తుంది. తనకేమైనా పరాయిదా? చిన్ననాటి స్నేహితురాలినని జ్ఞాపకం చేసింది, స్టేషనుదగ్గర కారు కూడా సిద్ధమంది; ఇంతకంటే తనకు కావలసినదేముంది?

రామనాథం మామూలు ప్రపంచంలోకి వచ్చేసరికి పూర్తిగా తెల్లవారిపోయింది. అంతూ దరీ లేని ఆలోచనల్లో ఈత కొట్టిన అతని మేధస్సు మత్తుగా జారిపోతోంది. వేడి వేడి కాఫీతో అది కాస్త మేలుకొంది.

“కాకినాడ వెడుతున్నాను. రేపొస్తా” అన్నాడు రామనాథం శోభతో.

“ఎందుకూ?” అంది శోభ. శోభ కళ్లల్లో ఆశ్చర్యమే అనండి నవ్వనండి ఒక్కసారి మెరిసింది.

“ఇదిగో చూడు, చాలా ఆపదలో ఉన్నాట్ట నా స్నేహితుడొకడు -అప్పుడప్పుడూ చెపుతూండేవాణ్ణి కృష్ణకుమారరావనీ- అతను ఉత్తరం రాశాడు. రమ్మన్నాడు. సాయంత్రమో రేపో తప్పకుండా వచ్చేస్తాను.”

శోభ కొద్దిగా కంగారు పడినట్టు కనిపించింది. శరీరమంతా ఒక తెర అలుముకున్నట్టు తోచింది.

“అయితే నిజంగా వెడతారా? అతను విశాఖపట్నంలో ఉంటున్నాడన్నారు కదూ? వెళ్ళిరండి మీ యిష్టం! పని కాకపోతే వెంటనే వచ్చేయండి. ఒక్క నిమిషం కూడా ఉండొద్దు. మాటివ్వండి.”

వెళ్లేటప్పుడు శోభకళ్ళలో నీళ్లు తిరిగాయి. కాని పకపక నవ్వేయడంతోనే, ఆనంద బాష్పాల క్రింద రాలిపోయ్యాయి. రామనాథం శోభ కళ్లలో నీళ్లు తిరగడం చూడకపోలేదు. తను వెళ్ళడం శోభకెందు కిష్టంలేదు? ఏడుస్తోన్నట్టుందే!

“శోభా! నే వెళ్ళడం నీ కిష్టం లేదా?”

“ఇష్టమే, వెళ్ళిరండి! పని కాకపోతే వెంటనే వచ్చేయండి.”

* * *

కృష్ణకుమారిని తలుచుకుంటూ రైలు దిగాడు రామనాథం. తనకోసం కారు ఎదురు చూస్తూంటుంది. ఒకవేళ తను కృష్ణకుమారిని గుర్తుపట్టకపోయినా, తనను కృష్ణకుమారి గుర్తుపట్టేస్తుంది—అది తథ్యం! ఎరగనిదైతే తనకి విపులంగా ఉత్తరం ఎలా వ్రాయగలుగుతుంది? స్టేషన్ ఇవతలికి వచ్చేసరికి తనకోసం కారు గాని, ఆఖరుకి రిక్షా గాని, వంటెద్దుబండి గాని మనిషి గాని, పిపీలికాది బ్రహ్మసృష్టిలో ఏ వస్తువు కూడా అతనికోసం, కృష్ణకుమారి ప్రతినిధిగా లేదు! రామనాథం మనస్తత్వం అంతా మారిపోయింది! కూతాకుడైపోయాడు! తెలిసినవాళ్లెవరలా చేసినా అంతగా నొచ్చుకునేవాడు కాదు. ఒక అజ్ఞాత స్త్రీవ్యక్తి తన్నలా పిలిచి, అవమానించటం దుస్సహమనిపించింది. అయినా ఒకవేళ రాలేకపోయ్యారేమో అని-

ఇంటికి వెడదామనుకున్నాడు. ఫ్రేజరు పేటలో పదకొండో వార్డు, తొమ్మిదివందల తొంభై తొమ్మిదో నెంబరు ఇంటికి వెళ్ళాడు రిక్షా మీద. ఆయింటి పైకప్పు లేనేలేదు! ఒక యుగం క్రితం వేసిన పిల్లగోడలు శిథిలీభూతమై పోయివున్నాయి. ఇంటినెంబరిరిక రామనాథం వచ్చేసరికి పూర్తిగా రద్దు చెయ్యబడి వుంది. ఏపేరు పెట్టుకుని ఎవర్నడుగుతాడు? ఇద్దరి ముగ్గురినడిగి చూశాడు. మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు. ఆ కృష్ణకుమారి—ఎవరో తామంతవరకూ వినలేదని, ఆ పేటలోకి రానే లేదని తేల్చేశారు.

చాలు! ఆయిన అవమానం చాలు!—రామనాథం తిరిగి రైలుముఖం పట్టాడు! తననిలా ఆ అజ్ఞాతవ్యక్తి ఆడించడానికి కారణం అనూహ్యంగా వుంది! తానేపాపం చేశాడు? ఇంతవరకూ శోభ వంటిమీద చెయ్యైనా వెయ్యలేదే? చీమనన్నా చంపలేదే? ఇంతదూరం రప్పించి ద్రోహంచేసే, ఆ పుణ్యాత్ము లెవరు? రామనాథాని కర్థం కాలేదు. సాయంకాలానికి చచ్చిచెడి ఇంటికి చేరుకునే సరికి—శోభ వీధిలో దీనంగా జాలిచూపులు చూస్తూ నుంచునివుంది.

రామనాథం మాటాడలేదు.

శోభ కూడా మౌనంగానే వుంది.

విశ్వనాథాన్ని నెమ్మదిగా శోభ పిలుస్తూ, "వెళ్ళిన పనయిందా?" అంది.

"లేదు! అంతా మోసం. ఈ ఉత్తరాన్ని నమ్మడానికి వీల్లేదు"

"మీ స్నేహితుడికి ప్రమాదం లేదుగదా."

"అంతా చచ్చారు" అన్నాడు చిరాకుగా. రామనాథానికి గొప్ప ఆశాభంగం. గాలిమేడలు కూలిపోయాయని ఏడుపుగా వుంది. రాత్రి ఎనిమిది గంటలవుతుంది. రామనాథంలో మత్తు తెర చీలిపోయి, కొద్దిగా మెళుకువగానే వున్నాడు. పక్క వేస్తో అంది.

"అలావున్నారేం? మనసేం బాగోలేదా?"

"ఇదిగో ఈ ఉత్తరం చూడు, అంతా అబద్ధం ఎవతె వ్రాశారో గాని"

శోభ పచ్చకవరు ఉత్తరం చూచింది. మళ్ళీ కన్నీళ్ళు తిరిగాయి.

"ఈ ఉత్తరం నమ్మారా?"

"నమ్మిగా ఏడుస్త. తీరా అక్కడ దెయ్యం లేదు."

శోభకు ఒక్కసారి భయం వేసింది. గజగజ వణికినట్టు వేళ్లు క్రుంగి పోయాయి. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ—"నిజంచెప్పమంటారా? నన్నేం అనరు గదా?"

"చెప్పు" రామనాథానికి పరిస్థితి అయోమయంగా వుంది. ఉత్తరం చూసి ఏడుస్తుండెందుకు? తన కొంప మునిగిపోయినట్టు?

"తరవాత ఏడుద్దువుగాని ముందు సంగతి చెప్పు."

శోభ బ్లౌజులోంచి, ఒక ఉత్తరం తీసి ఇచ్చింది. చదివాడు. "ఆఁ అదీ ఇదీ ఒకటేనే" అన్నాడు రామనాథం.

"నేనే వ్రాశాను" అంది శోభ.

"అయితే ఆ దొంగ కృష్ణకుమారివి నువ్వేనా? నిజంగా నువ్వేనా?"

రామనాథం ముఖంలో గొప్ప వెలుగు తాండవిస్తోంది. ఆశ్చర్యం ఊపిరి తిరక్క ఉక్కిరవుతోంది.

"అవును- మిమ్మల్ని పరీక్ష చేసుకున్నాను. ఓడిపోయారు. అందుకే ఏడుస్తుంట. అవసరమైతే చూడండి ఉత్తరం మీద గోదావరి ముద్ర రాజమండ్రీ ముద్ర ఉంటాయి."

రామనాథానికి నిజం బోధ పడింది.

"మీరు నాకు కొన్ని దొంగ ఉత్తరాలు, ఆనందరావనీ. మోహనరావని వ్రాసేవారు. అవి నేను తెలుసుకున్నాను. మీ పాతడైరీలో దొరికేయి రెండున్నూ. అంచేత నేను మీకు అందలేను- మీరు దొరికిపోయారు. దొంగలై పోతున్నారు! ఆ కృష్ణకుమారి ఎవరైతే మీకేం?" అంది శోభ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"ఇద్దరం తోడు దొంగలమే!" అన్నాడు రామనాథం.

---

మార్పు లేనిదే అభ్యుదయమన్నది అసంభవం. అనుభవం ద్వారా మారలేని మనుషులు దేనినీ మార్చలేరు—బెర్నార్డ్‌షా.